



• డొంకేశ్వర్‌లో ట్రాక్టర్ సాయంతో దుక్కులను సిద్ధం చేస్తున్న రైతులు

# వానాకాలం సాగుకు సమాయత్తం

- జిల్లాలో సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- ట్రాక్టర్ల సాయంతో దుక్కులు సిద్ధం చేస్తున్న వైనం
- వర్షాలు పడగానే పంట సాగుకు రైతుల ఏర్పాట్లు
- బోధన్ డివిజన్ పరిధిలో నాట్ల కోసం మడులు సిద్ధం
- జిల్లాలో ఈ ఏడాది పెరగనున్న పసుపు సాగు విస్తీర్ణం



నిజామాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలం సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటి నుంచే పొలం దుక్కులను దున్నడంతో పాటు విత్తనాలు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. వానాకాలం సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు పెట్టుబడికి అవసరమైన డబ్బులను సమకూర్చుకుంటున్నారు. జూన్ ఆరంభం నుంచి వర్షాలు మొదలు కానుండటంతో ముందస్తుగానే పంటల సాగు కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని కొన్ని మండలాల్లో రైతులు ముందస్తుగా వరినాట్లు వేసేందుకు నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ మొదటి, రెండో వారంలోనే నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆరుతడి పంటలు వేసే రైతులు సోయా, మొక్కజొన్నతో పాటు ఇతర విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు.

## వానాకాలం సాగుకు 15రోజుల గడువు

జిల్లాలో జూన్ ఆరంభం నుంచే రైతులు వానాకాలం సాగును మొదలు పెట్టనున్నారు. ఆరుతడి పంటల సాగుతో పాటు ఇతర పంటలను వేయనున్నారు. వానాకాలం ఆరంభానికి ఇంకా 15రోజుల్లోపే గడువు ఉండటంతో రైతులందరూ పనులపై దృష్టిపెట్టారు. యాసంగి పంటలు పూర్తి కావడంతో పంట చేనులను సాగుకు సిద్ధం చేస్తున్నారు. పసుపు, మొక్కజొన్న, సోయా వేసే భూముల్లో ఎస్సారెస్పీ మట్టితో పాటు కోళ్ల, పశువుల ఎరువులను వేస్తూ పంటల సాగుకు అనుగుణంగా మారుస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో ట్రాక్టర్లు పెట్టి దుక్కులను సిద్ధం చేస్తున్నారు. ఎడ్ల ద్వారా వ్యవసాయం చేయడం తగ్గిపోవడం వల్ల రైతులు మొత్తం ట్రాక్టర్లపై ఆధారపడ్డారు. గంటకు 900ల నుంచి 1300 వరకు వెచ్చిస్తూ భూములను దున్నిపిస్తున్నారు. వర్షాలు పడగానే పంటలు వేసే విధంగా సిద్ధం చేస్తున్నారు. ఎకరానికి సుమారు 4వేల వరకు వెచ్చించి ట్రాక్టర్లతో దున్నుతున్నారు. పసుపు సాగు చేసే రైతులు పెద్ద ట్రాక్టర్ల ద్వారా ప్లౌ, రోటేవేటర్‌తో దున్నిపిస్తూ సాగుకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతుండటంతో రైతులు దుక్కులు దున్నేందుకు అనుకూలంగా ఉండటంతో ఎక్కువ మంది సిద్ధం చేస్తున్నారు. జూన్‌లో వర్షాలు పడగానే నేరుగా విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

## 5, 52,128 ఎకరాల్లో వరిసాగుకు అంచనా

జిల్లాలో వచ్చే వానాకాలంలో మొత్తం 5లక్షల 52 వేల128 ఎకరాల్లో వరిసాగు అవుతుందని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగా వానాకాలం ప్రణాళికను ఖరారు చేశారు. నెల రోజుల ముందే ప్రభుత్వానికి పంపించారు. ఈ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లాలో ఈ వానాకాలంలో సాగు అయ్యే మొత్తం పంటలో వరి 4లక్షల 30వేల 550 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశారు. జిల్లాలో సాగుఅయ్యే మొత్తం పంటల విస్తీర్ణంలో 75 శాతం సాగు అవుతుందని అంచనాకు వచ్చారు. మొక్కజొన్న 41,909 ఎకరాల్లో, సోయాబీన్ 51,478 ఎకరాల్లో, పసుపు 19,606 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశారు. ఈ పంటలే కాకుండా కందులు, పెసర, పత్తితో పాటు ఇతర ఆరు తడి పంటలను కూడా రైతులు వేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో తీసుకువచ్చారు. జిల్లాలో వానాకాలంలో సాగు అయ్యే పంటలకు మొత్తంగా యూరియాను రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ వానాకాలం కూడా ఎక్కువ మొత్తంలో అవసరం పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాకు 75,880 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. డీఏపీ 16,490 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 12,319 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 40,833 మెట్రిక్ టన్నులు సాగు అవుతుందని అంచనాకు వచ్చారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాకు సరఫరా అయ్యే కోటాను ముందస్తుగానే తెప్పించి వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు.


## విత్తనాలు సిద్ధం చేసుకుంటున్న రైతులు

జిల్లాలో వానాకాలం సాగు కోసం రైతులు విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. వరిసాగు ఎక్కువగా కావడం వల్ల ప్రభుత్వ విత్తన అభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసే విత్తనాలతో పాటు ప్రైవేటు కంపెనీలు సరఫరా చేసే విత్తనాలను కూడా తీసుకుంటున్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని కొన్ని మండలాల రైతులు ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేశారు. వర్షాలు పడిన రీతిలోనే మొక్కజొన్న, సోయాబీన్, కందులతో పాటు ఇతర పంటలను వేసేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి విడతకు అవసరమైన ఎరువులను కూడా తీసుకుంటున్నారు.

## పసుపు సాగు వైపు మొగ్గు

గత సంవత్సరం 19వేల ఎకరాల్లోనే సాగు కాగా ధర బాగా రావడంతో ఈదఫా ఇతర ఆరుతడి పంటలను తగ్గించి పసుపు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ధరలు పెరగడం, ఎగుమతులు కూడా అవుతుండటం వల్ల రైతులు పసుపు సాగు వైపు మళ్లీ మొగ్గు చూపుతున్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ మొత్తంలో సాగు చేసేందుకు సన్నద్ధమవుతునారు. ఈ పంటలతో పాటు ఇతర పంటలను వేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఈ పంటల సాగుకు పెట్టుబడి ఎక్కువగా అవసరం ఉండటంతో ముందస్తుగానే సిద్ధం చేసుకుంటున్నారు. పంటలు వేసే సమయంలో ఎకరాకు 20వేల వరకు ఖర్చు కానుండటంతో అదే రీతిలో డబ్బులను సమకూర్చుకుంటున్నారు. ఈ వానాకాలంలో ఇంకా రుణ ప్రణాళికను లీడ్‌బ్యాంక్ ఇంకా ఖరారు చేయలేదు. రైతులు మాత్రం ముందస్తుగానే పెట్టుబడికి అవసరమైన నిధులను సమకూర్చుకుంటున్నారు. బ్యాంకులు రుణాలను పంపిణీ చేయగానే తీసుకొని పెట్టుబడికి వినియోగించే విధంగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. వచ్చే వానాకాలం కోసం రైతులు సన్నద్ధమవుతుండగా వ్యవసాయ అధికారులు కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వారికి అవసరమైన ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ వానాకాలంలో సాగు విస్తీర్ణం గణనీయంగా ఎరిగే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ తెలిపారు. ముందస్తుగానే వానాకాలం ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా విత్తనాల పంపిణీ చేపట్టామని తెలిపారు.

# పల్లెల్లో.. కానరాని పాడిగేదెలు



- రోజురోజుకూ తగ్గుతున్న పశువుల సంఖ్య
- నాడు వందల్లో.. నేడు పదుల సంఖ్యలో
- పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకం కరువు
- ఆటకెక్కిన 'పశుక్రాంతి' పథకం.. ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

ఆర్మూర్‌రూరల్, మే 17: పల్లెల్లో పాడిగేదెలు కానరావడం లేదు. గతంలో ప్రతీ గ్రామంలో వంద సంఖ్యలో ఉన్న పాడి పశువులు నేడు పదుల సంఖ్యలో ఉన్నాయంటే అతిశయోక్తికాదు. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువుల పెంపకం చేపట్టి అదనపు లాభాలు పొందేవారు. పాడి పశువులలో పాల విక్రయం ద్వారా ఆదాయంతో పాటు ఇంటిల్లిపాదికి శ్రేష్టమైన పాలు, పెరుగు లభించేది. అంతేగాకుండా వ్యవసాయ భూముల సారవంతానికి పశువుల పేడ సమృద్ధిగా లభించేది. గతంలో ప్రతీ ఇంట పాడిపశువులు ఉండేవి. గ్రామాల్లో పాడిపశువులు కనుమరుగైతే ప్రజలకు స్వచ్ఛమైన పాలకు, పాడికి దూరం అవడమే గాకుండా పంటలకు పశువుల ఎరువు కొరత ఏర్పడుతోంది.

## అటకెక్కిన పశుక్రాంతి పథకం

రైతుల జీవనోపాధి కల్పించేందుకు 2014 సంవత్సరంలో నాటి ప్రభుత్వం పశుక్రాంతి పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పాడి పశువులు కొనుగోలుకు రుణాలు అందజేసి సబ్సిడీ ఇచ్చేవారు. దీని ద్వారా అనేక గ్రామాల్లో రైతులు మహిళలు ఆర్థికాభ్యిద్ధి సాధించారు. గత ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి ఈ పథకం ముందుకు సాగలేదు. దీంతో రైతులు ఆర్థికంగా వెనకబడి పోతున్నారు. రైతుల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడే చర్యలను చేపట్టకపోవడంతో రానురాను పాడిపశువులు సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. దీంతో ప్రజలు పాడికి దూరం కల్తీ పాలకు దగ్గర అవుతున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పాడి పశువులు దర్శనమిస్తున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమీపంలో గ్రామాలలో మాత్రమే ఎంతో కొంత పాడి పశువులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పశువులు మేయడానికి కావాల్సిన పచ్చిగడ్డి లభిస్తుండడంతో రైతులు పశువుల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. ఇతర ప్రాంతాల్లో పాడిపశువులను పెంచే రైతులు ప్రత్యేకంగా పశుగ్రాసాన్ని పెంచడానికి కొంత భూమిని కేటాయించాల్సి వస్తుంది.

## పాడి పశువుల పెంపకందారులకు ప్రోత్సాహకం అందించాలి

ప్రభుత్వం పాడి గేదెల పెంపకానికి రైతులకు ప్రోత్సాహకం అందించాల్సిన అవసరం ఉంది. పాడి పశువుల పెంపకం పాల ఉత్పత్తుల తయారీపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఒక్క పాడి గేదెతో కుటుంబం ఎంతో జీవనోపాధి పొందుతుంది. పాడిగేదెలు కలిగి ఉన్న కుటుంబాలలో యువత పాడి పరిశ్రమపై ఆసక్తి పెంచుకుని డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందే అవకాశం ఉంది. గ్రామాలో కనుమరుగవుతున్న పాడి గేదెలు గ్రామగ్రామాన పాల ప్యాకెట్లు సప్లయి వచ్చింది. గతంలో పోల్చితే గ్రామాల్లో పాడిగేదెలు కానరావడం లేదు. ఆర్మూర్ ప్రాంతాలో ఓ గ్రామంలో కొన్నేళ్ల క్రితం సుమారు 400పైగా పాడి పశువులు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 30కి తగ్గింది. అయితే కొన్ని గ్రామాల్లోని యువత డెయిరీ ఫారాల ఏర్పాటుపై ఆసక్తి చూపుతోంది. గ్రామాల్లో రైతులు వ్యక్తిగతంగా పాడిగేదెల పెంపకం మానుకుంటున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో యువకులు డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. వీరికి ప్రభుత్వం సబ్సిడీపై పాడి గేదెలు అందజేసి కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పిస్తే అధిక పాల దిగుబడి సాధించే అవకాశం ఉంది. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని పలువురు రైతులు కోరుతున్నారు.







వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

# పాఠశాలల పునః ప్రారంభం నాటికి పనులన్నీ పూర్తి కావాలి

• ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నిజామాబాద్ అర్బన్, మే 17: రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని బడులు ప్రారంభమయ్యే నాటికి పనులన్నీ పూర్తి కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. కొత్త విద్యాసంవత్సరంలో బడులు ప్రారంభమయ్యేందుకు ఇంకా 20రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున యుద్ధప్రాతిపదికన పనులను గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాటు ధరణి దరఖాస్తులు, ప్రజావాణి అర్జీలు, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ లక్ష్య సాధన తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సగానికి పైగా జిల్లాలు దాదాపు 90 శాతం వరకు పనులను గ్రౌండింగ్ చేశామని మిగతా జిల్లాలు కూడా అన్ని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఉండే ప్రతి పాఠశాలల్లో తప్పనిసరిగా టాయిలెట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనఊరు మనబడి కింద ఇప్పటికే చేపట్టి వివిధ దశల్లో ఉన్న పనులను సైతం పూర్తి చేయించాలన్నారు. విద్యార్థులకు పాఠశాల పునఃప్రారంభం అయ్యే సమయానికి స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటికే జిల్లాలకు యూనిఫాం క్లాత్‌ను సరఫరా చేయడం జరిగిందని మహిళా సంఘాలకు వర్క్ ఆర్డర్ ఇచ్చి వారు సకాలంలో విద్యార్థులకు సరిపడా యూనిఫాంలు ఇచ్చేలా చూడాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై ఆర్డీవోలు, తహసీల్దార్లు సమీక్ష ఏర్పాటు చేసుకొని వివిధ మాడ్యుల్స్ కింద వచ్చిన దరఖాస్తులను ఈ నెలాఖరులోగా వందకు వంద శాతం పరిష్కరించాలన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత జిల్లాలకు పంపించడం జరుగుతుందని వాటిని వెంట వెంటనే పరిష్కరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణ వేగవంతం చేస్తూ వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. అదే సమయంలో మిల్లులు పూర్తిస్థాయిలో సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా పర్యవేక్షణ చేస్తూ సీఎంఆర్ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. ఈ దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సాంకేత్ కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీఈవో దుర్గాప్రసాద్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీశ్, డీసీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



# అక్రమ రిజిస్ట్రేషన్లపై నజర్



- నాన్ లే అవుట్ రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం సీరియస్
- అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు అభియోగాలు
- జూన్ 15లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశం

ఖిల్లా, మే 17: నాన్ లేఅవుట్ ప్లాట్లకు అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖపై సీరియస్ అయింది. అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన అధికారులపై చర్యలకు సిద్ధమైంది. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వం 2020 ఆగస్టు 16లో నాన్ లేఅవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరపకూడదని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలచిపోయాయి. అయితే కొందరు వెంచర్లు చేసి అమ్మిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అక్రమ మార్గాన రిజిస్ట్రేషన్లు చేయించినట్లు ఇప్పటి ప్రభుత్వం గుర్తించింది. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలపివేసిన నాటి నుంచి ఇప్పటి వరకు ఏఏ కార్యాలయాల్లో, ఏఏ అధికారి దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేశారో ఆరా తీసింది. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారి చేసింది. అవినీతికి పాల్పడిన వారి వివరాలను సేకరించి జూన్ నెల 15వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో అధికారుల పనితీరును నివేదిక ద్వారా తెలియచేయాలని ఆదేశాలు చేసింది. జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఆదాయం సమకూరే కార్యాలయాల్లో అనధికార నాన్ లేఅవుట్ రిజిస్ట్రేషన్లు చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలకు ఆదేశించినట్లు సమాచారం. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులు విజిలెన్స్ విచారణను ఎదుర్కోలేక దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లినట్లు సమాచారం. రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయా శాఖాల అధికారులతో సమీక్ష నిర్వహించి వారికి పలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించినట్లు సమాచారం. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఇతర మంత్రులతో కలిసి సమీక్ష నిర్వహించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ఆదేశించారు.



# సర్కారు బడులకు మహర్దశ!

- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌలిక సదుపాయల కల్పన
- పాఠశాలల పునః ప్రారంభంలోగా పనులు పూర్తి కావాలని లక్ష్యం

నవీపేట, మే 17: ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దుకోనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పని చేస్తున్నప్పటికీ పలు చోట్ల పాఠశాలల్లో మౌలిక సదుపాయలు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికి విరుగుడుగా ప్రభుత్వ పాఠశాలలను సైతం ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు పూనుకుంది. గత ప్రభుత్వం మన ఊరు, మన బడి అనే పేరుతో పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయలను కల్పించారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం సైతం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు చేపట్టింది. సంవత్సరంన్నర క్రితం మన ఊరు, మన బడిలో భాగంగా మండలంలోని 20ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి వసతి, తరగతి గదుల మరమ్మతులు, టాయిలెట్ల మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, మైనర్ రిపేర్ వంటి పనులను నామినేషన్ పద్ధతుల ద్వారా చేపట్టారు. అలాగే మేజర్ పనులైన డైనింగ్ హాళ్ల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణాలకు సైతం టెండర్ ప్రాతిపాదికన కేటాయించారు. దీనికి సంబంధించి 6.12 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఇందులో ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనులు చేపట్టడానికి ఎవరు టెండర్ ప్రక్రియలో పాల్గొనకపోవడంతో అందులో పనులు నిలిచిపోయాయి. మిగిలిన 15పాఠశాలల్లో 3కోట్ల రూపాయల వ్యయంతో వివిధ పనులు చేపట్టారు. ప్రస్తుతం నూతన రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మండలంలోని మిగిలిన మరో 39 ప్రభుత్వ పాఠశాలల్లో సైతం తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం వంటి పనులు చేపట్టడానికి మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలకు 2,52,30,000 రూపాయల నిధులు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి పనులను వెంటనే ప్రారంభించడానికి ప్రతి పాఠశాలలకు మంజూరైన నిధులలో 10శాతం వాటాగా 39ప్రభుత్వ పాఠశాలలకు 25లక్షల రూపాయల నిధులను కలెక్టర్ ఇటీవల విడుదల చేశారు. సంబంధిత నిధులను వెంటనే పాఠశాలల కమిటీల అకౌంట్‌లలో జమ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. సంబంధిత పనులను పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులైన సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాళ్ల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. ఇందులో ఈ పాటికి పలు పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. మండలంలో అధ్వానంగా మారిన పలు ప్రభుత్వ పాఠశాలల భవనాల రూపురేఖలు మారనున్నాయి.

### నిధులు మంజూరయ్యాయి..

:శ్రావణ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ, నవీపేట



మండలంలోని 39ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు నిధులు మంజూరయ్యాయి. పనులను వెంటనే ప్రారంభించడానికి 10శాతం వాటా కింద రూ.25లక్షల నిధులను కలెక్టర్ విడుదల చేశారు. సంబంధిత పనులు పలు పాఠశాలల్లో ఈ పాటికే ప్రారంభం కాగా మిగిలిన పాఠశాలల్లో సైతం పనులను వెంటనే ప్రారంభిస్తాం.



ఉత్తమ ఏడీఈగా ఎంపికైన సుహాసినిని అభినందిస్తున్న డీఈ, ఇతర ట్రాన్స్‌కో సిబ్బంది

## ఉత్తమ ఏడీఈగా సుహాసిని ఎంపిక

నవీపేట,మే17: విద్యుత్ శాఖలో పని చేస్తున్న నవీపేట ఏడీఈ సుహాసిని ద్వితీయ ఉత్తమ ఏడీఈగా ఎంపిక కావడం పట్ల శుక్రవారం ఆమెను పలువురు సిబ్బంది అభినందించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ పనితీరు కనబర్చిన నవీపేట ఏడీఈ సుహాసిని సంస్థ పరిధిలో ద్వితీయ స్థానంలో ఎంపికైనట్లు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కే.వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకటించారు. అలాగే నవీపేట ఏఈగా పని చేస్తున్న ప్రవీణ్ కుమార్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఎంపికైనట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఏడీఈ సుహాసిని, ఏఈ ప్రవీణ్ కుమార్‌లను శుక్రవారం మండల కేంద్రంలో ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జన్నేపల్లి ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్స్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, ఈఆర్‌వో కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

## నీటి సమస్యకు పరిష్కారం!!

మోస్రా, మే 17: మండలంలోని చే నెంబర్ తండా దుబ్బలో గత కొన్ని రోజులుగా గ్రామ ప్రజలు నీటి సమస్య ఉన్నదని గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండు బోర్లు వేయించి రెండు వన్ హెచ్‌పీ మోటార్లు ఇప్పించి తమ గ్రామ నీటి సమస్యను పరిష్కారం చేశారని గ్రామ అధ్యక్షుడు రత్నవత్ వీరన్న తెలిపారు.



# అధ్వానంగా కొలిప్యాక్ బీటీ రోడ్డు



చెడిపోయిన బీటీ రోడ్డు



చెడిపోయిన రోడ్డుపై కంకర తేలి గుంతలు పడ్డ దృశ్యం

● రోడ్డుపై కంకరతేలి భారీ గుంతలు


జక్రాన్‌పల్లి, మే 17: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లితే చెడిపోయిన బీటీ రోడ్లను మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాలకు వెళ్లే రోడ్డు చెడిపోయి అధ్వానంగా మారి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు చెడిపోయి అధ్వానంగా మారింది. మనోహరాబాద్ సాయిబాబా ఆశ్రమం, కొలిప్యాక్ గ్రామం నుంచి ఎక్స్‌రోడ్డు వరకు కొన్నేళ్ల నుంచి బీటీరోడ్డు చెడిపోయింది. రోడ్డుపై వెళ్లాలంటే ఇరువైపు వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కొలిప్యాక్ గ్రామానికి వెళ్ళే బీటీరోడ్డు చెడిపోయి కంకర తేలి భారీ గుంతలు పడ్డాయి. దీంతో ప్రజలు రోడ్డు వెంట వెళ్లాలంటే నానా తంటాలుపడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే రోడ్డు బీటీరోడ్డు చెడిపోగా మరమ్మతుకు నిధుల మంజూరు కోసం రూ.3కోట్లతో అప్పటి రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రతిపాదనలు పంపారు. అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.

● వర్షా కాలం.. ప్రమాదాలకు ఆస్కారం!!

రానున్న వర్షాకాలం కావడంతో బీటీరోడ్డు చెడిపోయి కంకరతేలి రోడ్డుపై గుంతలు పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెడిపోయిన బీటీరోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించి మరమ్మత్తు పనులు చేయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నప్పటికీ పట్టించుకోలేదని ఆగ్రమస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైె సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి చెడిపోయిన కొలిప్యాక్ బీటీరోడ్డు మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

**: కుంట చిన్న నర్సయ్య, కొలిప్యాక్**



మండలంలోని కొలిప్యాక్ గ్రామం బీటీ రోడ్డు చెడిపోయి అధ్వానంగా మరింది. ఈ రోడ్డు వెంట వెళ్ళాలంటే గ్రామస్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం అయినందున చెడిపోయిన బీటీరోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి. ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నాం.

### బీటీ రోడ్డు మరమ్మతు పనుల కోసం రూ.3కోట్లతో ప్రతిపాదనలు పంపుతాం

**: ప్రవీన్, ఆర్‌అండ్‌బీ ఏఈ, జక్రాన్‌పల్లి**

మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు చెడిపోయింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ద్వారా బీటీరోడ్డు మరమ్మత్తు పనుల కోసం రూ.3కోట్లతో ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే టెండర్‌లు కాగానే చెడిపోయిన కొలిప్యాక్ బీటీరోడ్డు మరమ్మత్తులను చేపడతాం.

# ఆరు గ్యారంటీలు కాదు, ప్రభుత్వామే గ్యారంటీ లేదు

● ఇచ్చిన హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలం ● వరికి రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే.. ● రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



నివాళ్లు అర్పిస్తున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, మే 17: అబ్బదపు హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నరని ఇచ్చిన హామీలు నేరావేర్చే వరకు ప్రభుత్వాన్ని వదిలేది లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో తల్లి తెలంగాణ విగ్రహం వద్ద శుక్రవారం పూలతో విగ్రహానికి నివాళ్లు అర్పించిన అనంతరం దర్నా చౌక్ లో నిర్వహించిన ధర్నాలో బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రస్తుతం గ్యారంటీ లేదని, ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, బాజిరెడ్డి హెచ్చరించారు. డిసెంబరు 9నే రైతు రుణా మాఫీ చేస్తానని చెప్పి తప్పించుకొని కల్లిబొల్లి మాటాలతో కాలం వెల్లదీస్తున్నరన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వేదించి ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, అవసరమైతే పోలీస్ స్టేషన్‌ల ఎదుట ధర్నాలు చేసి కార్యకర్తలను కాపాడుకుంటానని తెలిపారు. ప్రజలకు, రైతాంగానికి అండగా ఉండేది బీఆర్ఎస్ మాత్రమేనని, ఆగస్టు 15లోగా రైతు రుణా మాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న ఏ సంవత్సరం ఆగస్టు నెలలో చేస్తారో మాత్రం చెప్పడము లేదని విమర్శించారు. తాను ఎంపీగా గెలిస్తే జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆర్టీసీ సంస్థ ఇప్పటికే పీకాల్లోతు అప్పులో ఉందని, 1400 బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని రైతులే రబ్బరు చెప్పులతో కొడుతారని ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ఘాటు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్ బాజిరెడ్డి, ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహిపాల్ యాదవ్, మొచ్చ శ్రీనివాస్,చిలివేరి గంగాదాస్, మధుకర్ రావు, నారాబోయిన శ్రీనివాస్, కుంచాల రాజు, తొర్లికొండ రాజు, హన్మంత్‌రెడ్డి, శక్కరి కొండ కృష్ణ, ఒడ్డం నర్సయ్య, రామడుగు మహేందర్, తిరుమల్, అజయ్, పద్మరావు, గీత, లక్ష్మీ, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్

రెంజల్, మే 17: ఎండలు తీవ్రతరమవ్వడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎండలు తీవ్రతరమవ్వడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసి పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్, అర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ మున్ని నాయక్, ఏఈ గబ్బర్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర గౌడ్, రాజేందర్, సాయిలు, సునీల్, రజని, రాణి, సాయిబాబా, రాజు, నవీన్, శ్రీకాంత్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

### బోధన్ డివిజన్ అధికారుల సమాచారం

| | |
|---|---|
| ఆర్డీవో | 9491036893 |
| బోధన్ ఏసీపీ | 8712659809 |
| బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ | 8555939494 |
| మున్సిపల్ కమిషనర్ | 6305249776 |
| తహసీల్దార్ | 9491036917 |
| రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ | 9397970606 |
| శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ | 9676846754 |
| వాతావరణ శాఖ బోధన్ | 9885865423 |
| ఎక్సైజ్ శాఖ సీఐ | 8712658975 |
| పట్టణ సీఐ | 8712659870 |
| రూరల్ సీఐ | 8712659871 |
| ఐసీడీఎస్ సీడీపీవో | 6303829709 |
| ఆర్టీసీ డిపో మేనేజర్ | 9959226001 |
| ఆర్టీసీ ఎంక్వైరీ | 9848500725 |
| రైల్వే స్టేషన్ | 9491104601 |
| ప్రభుత్వ జూనియర్ కళాశాల | 9959951061 |
| మధుమలంచ జూ. కళాశాల | 9182389186 |
| ప్రభుత్వ డిగ్రీ కళాశాల | 9494027975 |
| వ్యవసాయ శాఖ | 7288894588 |
| ఎంపీడీవో | 9849900110 |

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిపేట, మే 17: నందిపేట, మక్లూర్ మండలాల పరిధిలో ఉన్న 33/11కేవి సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ ఎం.అశోక్ తెలిపారు. అలాగే నిజామాబాద్ రూరల్ మండలం జన్నేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సైతం కరెంటు సరఫరా ఉండదన్నారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు. దీనికి నందిపేట, మాక్లూర్ మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ కోరారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కోటగిరి, మే 17: పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామానికి చెందిన సమత బాయికి శుక్రవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన స్వగృహంలో 2లక్షల సభ్యత్వ భీమా చెక్కును పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త దిలీప్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో బాధిత కుటుంబానికి 2లక్షల రూపాయల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ గౌతం, నాయకులు సూరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

సమ్మర్ స్పెషల్

# ఆహ్లాదాన్ని పంచుతున్న వాటర్ పార్క్

● ఫ్యామిలీ టూర్ జోన్‌గా సుభాష్ గార్డెన్ ● ఆకట్టుకుంటున్న వాటర్ గేమ్స్ ● సామాన్యులకు అందుబాటులో వాటర్ గేమ్స్‌జోన్

నిజామాబాద్ అర్బన్, మే 17: వేసవి వచ్చిందంటే చాలు కుటుంబంతో కలిసి సేద తీరాలని ప్రతీ సామాన్యుడు కోరుకుంటాడు. నిత్యం పనుల్లో అలసిపోయి కొన్ని రోజులు కుటుంబంతో కలిసి విహార యాత్రలకు వెళ్తుంటారు. కానీ విహార యాత్రలకు వెళ్లాలన్న, ఇతర చల్లటి ప్రదేశాలకు కుటుంబంతో కలిసి వెళ్లాలన్న ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ప్రతి ఒక్కరు వెనకడుగు వేస్తుంటారు. కానీ మనకు అందుబాటులో ఉన్న ఆనందాల్లోనే గడపాలనుకునే సామాన్యులకు నగర శివారులోని మదన్‌పల్లిలోగల సుభాష్‌గార్డెన్ ఆహ్లాదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చుట్టూ కొండలు, పొలాల మధ్య పూర్తిగా గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా సుభాష్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్క్ (వాటర్ పార్క్) అందరిని ఆకట్టుకుంటుంది. ఇదివరకు హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు పరిమితమైన వాటర్ గేమ్స్ జోన్ సామాన్యులకు అందుబాటులోకి ఉండేలా మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేశారు. పాఠశాల పిల్లలకే కాకుండా ఫ్యామిలీతో కలిసి ఒకరోజు ఎంజాయ్ చేయాలనుకునే వారికి ఈ వాటర్ గేమ్స్ జోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నిజామాబాద్ నగరానికి చెందిన కేసరి శ్రీనివాస్‌రెడ్డి 2003లో ఈ ఆగ్రో టూరీజం పార్క్‌ను ఏర్పాటు చేశారు. వాటర్ పార్క్ కాకుండా మామిడి, మలబార్, వేపచెట్లు, సపోటా చెట్లు ఈ పార్కులో ఉన్నాయి. మొత్తం 45 ఎకరాల్లో ఈ ఆగ్రో టూరిజం పార్క్ ఉంది. కుటుంబంతో కలిసి సరదాగా గడిపేందుకు ఈ పార్క్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాలలు కొనసాగే సమయంలో అనేక మంది పాఠశాలల విద్యార్థులు ఈ పార్కును సందర్శించడం జరిగింది. వేసవిలో వాటర్ గేమ్స్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారికి ఈ పార్క్ అందుబాటులో ఉంది. ఇందులో వాటర్ స్లైడ్స్, డ్రైట్స్, టవర్ స్లైడ్స్ ఫ్యామిలీ ప్లే స్టేషన్, మల్టీలైన్ రైసర్ స్లైడ్స్ ఏర్పాటు చేశారు. చిన్నారులకు వివిధ గేమ్స్ ఆడుకునేందుకు పార్కుతో పాటు ప్లే జోన్స్‌ను ఏర్పాటు చేశారు. ఫ్యామిలీతో కలిసి పిక్‌నిక్ వెళ్లేందుకు పిల్లలు ఎంజాయ్ చేసేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంలో జిల్లాతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, మహారాష్ట్రలోని అనేక మందికి ఈ పార్క్ అందుబాటులో ఉంది.


నిజామాబాద్ నగర శివారులోని మదన్‌పల్లిలో గల సుభాష్ గార్డెన్(వాటర్ పార్క్)


వాటర్ పార్క్‌లో కేరింతలు కొడుతున్న చిన్నారులు


పార్క్‌లో సరదాగా గడుపుతున్న చిన్నారులు (ఫైల్)

## 'వైద్యులు సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు అందించాలి'

బోధన్ రూరల్, మే 17: వైద్యులు సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని అన్నారు. ఇబ్బందులు ఏమైన ఉంటే తమకు తెలియజేయాలన్నారు. చిన్న పిల్లలకు టీకాలను సకాలంలో వేయాలని, పిల్లల్లో సమస్యలు కనిపించినట్లయితే వైద్యులకు చూయించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రేమతో మాట్లాడుతూ వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను వైద్యులు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్, ఆర్ఎంఓ డాక్టర్ అబ్దుల్ రహీం, డాక్టర్ సందీప్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజాయతీ గల వారిని వర్సిటీకి వీసీగా నియామించాలి : పీడీఎస్‌యూ

డిచ్‌పల్లి, మే 17: తెలంగాణ విశ్వవిద్యాలయానికి నిజాయతీగల వారిని ప్రభుత్వం వీసీగా నియామించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో అన్ని యూనివర్సిటీలను భ్రస్టు పట్టించారని, మాజీ సీఎం యూనివర్సిటీలను విధ్వంసం చేశారని వర్సిటీలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. గత కాంగ్రెస్ హయంలో ఏర్పాటు అయిన తెలంగాణ విశ్వవిద్యాలయంకు రూ.వంద కోట్ల నిధు లు మంజూరు చేయాలని, వర్సిటీ అభివృద్ధి దోహదవ చేస్తు , నిజాయితీ గల వీసీ, రిజిస్ట్రార్‌లను నియామించాలని డిమాండ్ చేశారు. గతంలో పాలక మండలి తీసుకున్న నిర్ణాయాలను అమలు చేయాలేదని అవినీతి వీసీ లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ వర్సిటీ ప్రక్షాలన జరగ లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వర్సిటీలపై ప్రభుత్వం చిత్త శుద్ధి చూపాలని అడ్మినిస్ట్రేషన్, పరిశోధనలపై నైపుణ్యాత గల వారిని వీసీలుగా నియామించలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రవీందర్, వంశీ, గోపి, రాజు, పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోటగిరి, మే17: కోటగిరి మండలంలో శనివారం మధ్యాహ్నం 3గంటల నుండి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కోటగిరి, కొత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ..వేంకటేశ్వర స్వామి కల్యాణం

రుద్రూరు, మే 17: మండల కేంద్రంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలను శనివారం కన్నుల పండుగగా నిర్వహించడం జరుగుతుందని ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధనా కేంద్రం అధిపతి బాలాజీనాయక్ తెలిపారు. ఉదయం 10.35 గంటలకు శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని బ్రహ్మశ్రీ శ్రీనివాస్ శర్మ, విష్ణుశర్మ, రోహిత్ శర్మ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అదే విధంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## 'అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తులు'

మెండోర, మే17: మండలంలో పోచంపాడ్ తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల కళాశాల పోచంపాడ్‌లో 2024-25వ సంవత్సరంనకు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు విద్యార్హతలు అనుభవం కలిగిన అతిథి ఉపాధ్యాయులు విద్యార్హతలు అనుభవ సర్టిఫికెట్లు జతచేసి 30వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తారాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం బౌతికశాస్త్రం రసాయనిక శాస్త్రం వృక్షశాస్త్రం జంతు శాస్త్రం నర్సింగ్ ఆఫీసర్ సబ్జెక్టుల్లో డిగ్రీ బీఈడీ, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని మరిన్ని వివరాలకు 9866559693నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## 'లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి'

పెర్కిట్, మే17: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో 7వార్డు తిరుమల కాలనీవాసులు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ బాస్కరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్‌ఫేజ్ ఉండడం వల్ల లోవోల్టేజీ సమస్య తలెత్తుతుందని, త్రీఫెజ్‌కు మార్పులు చేసినట్లతే సమస్య పరిష్కరమవుతుందని, వెంటనే ఏడీకి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మధుసూదన్, ఖాందేశ్ ప్రశాంత్, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు

# డిగ్రీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి


పాల్గొన్న పరీక్ష కేంద్రాల సూపరిండెంట్‌లు, ప్రిన్సిపాళ్లు

● తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి

డిచ్‌పల్లి, మే 17: ఈ నెల 21 నుంచి జూన్ 15 వరకు ఉమ్మడి జిల్లాలో 38పరీక్ష కేంద్రాల్లో డిగ్రీ పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బంది ఏర్పాట్లు చేసినట్లు టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి తెలిపారు. శుక్రవారం వర్సిటీలో పలు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్, ఆడిట్‌సెల్ అధికారులతో జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరిండెంట్ గా విధులు నిర్వహించే వారు పేపర్ డౌన్ లోడ్ చేసే సమయానికి విధిగా పరీక్ష కేంద్రంలో ఉండాలని ఆదేశించారు. చీఫ్ సూపరిండెంట్ లకు అనివార్యమైన పనులు ఉంటే విధిగా అక్కడ ఉన్న మరో అధికారికి లిఖిత పూర్వకంగా బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ విషయం ఆడిట్ సెల్ లేదా, పరీక్షల విభాగం అధికారులకు సమాచారం చేరవేయలన్నారు విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరించారు. 2,4,6 సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు దాదాపు 24వేల మంది విద్యార్థులు, 1,3,5 సెమిస్టర్ బ్యాక్ లగ్ పరీక్షలకు 14వేల మంది పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఏలాంటి లోసుగులు లేకుండా పరీక్షల ఏర్పాట్లు చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. పేపర్ డౌన్‌లోడ్ సమయంలో వర్సిటీ నియామించిన అబ్జర్వర్‌తో పాటు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరిండెంట్ తప్పక ఉండలన్నారు. ఈ సారి ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో ఇన్వి జిలేటర్‌లు ఫోన్ లను ఉపయోగించవద్దన్నారు. ఈ సమావేశంపై ముందస్తు సమాచారం ఇచ్చిన్నప్పటికి కొంత మంది ప్రిన్సిపాళ్లు మరీ ముఖ్యమంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఏలాంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవడం పట్ల రిజిస్ట్రార్ అసహనం వ్యక్తం చేశారు. ఆయా ప్రిన్సిపాళ్ల నుంచి గైర్హాజరు విషయం వివరణ కోరాలని ఆడిట్ సెల్ అధికారులకు రిజిస్ట్రార్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ, ఆకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ ఆతిక్ సుల్తాన గోరీ, పలు కళాశాలల సూపరిండెంట్ పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల తీరుపై విమర్శలు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల వైఖరి తీవ్రమైన విమర్శలకు దారి తీస్తుంది. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాల పాటించకుండా ఇష్టనుసారంగా వ్యవహరిస్తున్నరని ప్రచారం సాగుతుంది. ఇందుకు ఉదహర ఇటీవల వార్షిక తనిఖీల్లో భాగంగా తెలంగాణ వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి తనిఖీలకు వెళ్లిన అక్కడ ప్రిన్సిపాల్ గైర్హాజరం విమర్శలు వచ్చాయి. ఈవిషయంలో ప్రిన్సిపాల్ ను తెలంగాణ వర్సిటీ అధికారులు వివరణ కోరిన పట్టించుకోలేదని తెలుస్తుంది. ఇది జరిగిన 15 రోజుల్లోనే వర్సిటీలో శుక్రవారం రిజిస్ట్రార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు గైర్హాజరవడం గమనార్హం.


హాసాకొత్తూర్‌లో పనుల వివరాలను తెలుసుకుంటున్న అంకిత్


బషీరాబాద్‌లో పాఠశాల గదులను పరిశీలిస్తూ..

### నెలాఖరులోగా అన్ని పాఠశాల్లో..

# వంద శాతం పనులు పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు

కమ్మర్‌పల్లి, మే 17: రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాల్లో మంజూరి ఇచ్చన అభివృద్ధి పనులు నెలలోపు పూర్తి చేయించాలని జిల్లా లోకల్‌బాడి అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం మండంలలోని అమ్మ ఆదర్శపాఠశాలలుగా ఎంపికైన హసాకొత్తూర్, బషీరాబాద్ ఉన్నత ప్రామిక పాఠశాల్లో విద్యుదీకరణ, తదితర అభివృద్ధి పనులను ఆయన సందర్శించి సరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందునిమిత్తం మంజూరైన పనులు నెలలోపు ప్రతి పాశాలలో వందశాతం పనులు పూర్తి అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనేఉలపట్ల ప్రత్యేక దృష్టసారించాలని, పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు జూన్ 12 వరకు ప్రభుత్వం మహిళ సంఘాలకు అప్పగించిన ఏకరూపదుస్తుల తయారి పూర్తి కావాలని మహిళ సంఘాలనుద్దేశించి అన్నారు. అనంతరం మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. వందశాతం పనులన్ని ఈ నెలాఖరులోగా కాగా మండలంలోని అమ్మ ఆదర్శపాఠశాలలు 18కి గాను 17 పాఠశాల్లో పనులు ప్రారంభమైనట్లు ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. ఆయనవెంట ఎంపీడీవో రాజ శ్రీనివాస్, తహసీల్దార్ ఎం ఆంనేయులు, ఏఈ పీఆర్ శ్రీనివాసులు, ఎంపీవోసదాశివ్, ఏపీఎం కుంట గంగారెడ్డి, సిసిలు నవీన్, భాగ్యలక్ష్మీ, పంచాయితి కార్యదర్శులు నర్సయ్య, అమ్మఆదర్శ పాఠశాలల కమిటి సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థి సాయిస్వాగత్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

## ఫైరింగ్ కాంపిటీషన్‌లో విద్యార్థి ప్రతిభ

ఆర్మూర్ రూరల్, మే 17: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ కెడెట్ కర్ణం సాయి స్వాగత్ ఫైరింగ్ కాంపిటిషన్‌లో ప్రతిభ చూపినట్టు కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ తెలిపారు. ఇటీవల జరిగిన బెటలియన్ లెవల్‌లో, గ్రూప్ లెవల్‌లో ప్రతిభ చూపి ఫైరింగ్ కాంపిటిషన్‌కు ఎంపికయ్యారని తెలిపారు. కాకినాడలో జరిగిన జాతీయస్థాయి క్యాంప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆయన తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థి సాయిస్వాగత్‌ను కళాశాల యాజమాన్యం అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్ అభినందించారు.

## 'ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి'

ఆర్మూర్ రూరల్, మే 17: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదవ తరగతి పూర్తయిన వారు చేరాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో వివిధ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌ల కోసం ఇటీవల పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేరాలని, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించారు. ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు 24 నుంచి జరగనున్న అడ్మిన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ దేవరాం తెలిపారు. ఇందులో అధ్యాపకులు వెంకటేష్, నవీన్, సవతి, తదితరులున్నారు.

## 'స్పోర్ట్స్ కోటలో బ్యాంకులో ఉద్యోగాలు'

ముప్కాల్, మే 17: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్పోర్ట్స్ కోటలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాస్థాయి క్రీడాకారులు 24తేదీ ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, స్పోర్ట్స్ కోట పొందిన ధృవపత్రం వయస్సు ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఎత్తిపోతల చైర్మన్‌ల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

డొంకేశ్వర్, మే 17: ఉమ్మడి మండలాల ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లిలో గ్రామంలో చైర్మన్ సమావేశమై ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా మారంపల్లి లిఫ్ట్‌చైర్మన్‌గా మోర్తాడ్ బోజారెడ్డి, ఉపాధ్యక్షునిగా దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ సుంకరి రాజు, కార్యదర్శిగా ఓంకార్‌లను ఏన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మోర్తాడ్ బోజారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ ఎకరానికి నీరు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. లిఫ్ట్‌ల సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లిఫ్ట్ చైర్మన్ జిల్కర చిన్నయ్య, రమేష్, గంగారెడ్డి, నర్సారెడ్డి, రాజేశ్వర్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన ఎత్తిపోతల కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

## మొక్కల సంరక్షణ గాలికేనా?

● నా దృష్టికి రాలేదు : డీఎల్‌పీవో సాయిబాబా

మోస్రా, మే 17: మోస్రా మండలాన్ని అభివృద్ధిలో ఉంచాలనే ఉద్దేశంతో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా ఏర్పాటు చేయగా మండల కేంద్రం అందంగా కనబడాలనే ఆలోచనతో భాగంగా రోడ్డుకు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అదే విధంగా గ్రామంలో పచ్చగా కనబడే విధంగా గ్రామ పంచాయతీ నిధుల నుండి 1250రూపాయలు విలువ గల మిర్చిమేరీ గ్రీన్ రకం చెట్లను రోడ్డు డివైడర్‌లో నాటారు. ఈ చెట్లలో దాదాపు 90చెట్లు పూర్తిగా ధ్వంసం కాగా మరికొన్ని చెట్లు నీరుపోయాక, మరికొన్ని సరిగ్గా తవ్వక ఎండిపోతున్నాయి. ఇట్టి విషయంపై ఆరా తీయడం సంగతి దేవుడెరుగు. కనీసం పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇట్టి విషయంపై డీఎల్‌పీవో సాయిబాబాను వివరణ కోరగా.. నాకు ఇట్టి విషయంపై ఏమీ తెలియదని పత్రికలో రాసిన తర్వాత మా దృష్టికి వస్తే విచారణకు వస్తానని తెలిపారు.










1) మోస్రా మండలకేంద్రంలో ఎండిపోయిన మొక్కలు
2) నిజామాబాద్-బాన్సువాడ రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు
3) మొక్కను మేస్తున్న పశువులు



హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

# మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల ఆందోళన

- నగరంలో నిలిచిన చెత్త సేకరణ
- ఉన్నతాధికారుల జోక్యంతో మళ్లీ విధుల్లోకి డ్రైవర్లు

సుభాష్‌నగర్, మే 17: ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాని కోరుతూ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పట్టణ నిరాశ్రయుల భవనంలో చెత్త సేకరణ ఆటోలను నిలిపివేసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. విధులను బహిష్కరించడంతో నగరంలో చెత్తసేకరణ నిలిచిపోయింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించేంతవరకు చెత్త సేకరణ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సమస్యలపై మున్సిపల్ అధికారులకు విన్నవించిన సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం మున్సిపల్ ఉన్నతాధికారులు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. యదావిధిగా విధులు నిర్వహించాలని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడంతో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు సమ్మెను విరమించారు.



నగరంలో నిలిచిన చెత్తసేకరణ వాహనాలు

# ఉపాధి హామీ కూలీలచే మట్టిరోడ్డు, చెక్‌డ్యామ్ పూడికతీత



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎండీవో

ధర్పల్లి, మే 17: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఒన్నాజిపేట్, కొటాల్‌పల్లిలో ఉపాధి హామీ కూలీలచే మట్టిరోడ్డు నిర్మాణంతో పాటు చెక్‌డ్యామ్‌లో పూడికతీత పనులు చేపట్టినట్లు ఎండీవో బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఆయన పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండీవో మాట్లాడుతూ ఒన్నాజిపేట్‌లో రెండు కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు నిర్మాణం పనులను ఉపాధి హామీ కూలీలచే నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మట్టి రోడ్డు అనంతరం దీనిపై గ్రావెల్ రోడ్డు వేస్తామని ఆయన తెలిపారు. కొటాల్‌పల్లిలో ఉన్న చెక్‌డ్యామ్‌లో పూడికతీత పనులను చేపట్టామన్నారు. కూలీల సంఖ్య పెరిగే విధంగా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ కార్యదర్శులు స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ప్రథమ చికిత్సకు సంబంధించి మందులు, నీడ సౌకర్యం కూలీలకు కల్పించాలని ఆయన ఆదేశించారు.కార్యక్రమంలో కార్యదర్శి రఘురాం, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

# రైతులకు 50 శాతం సబ్సిడీ అందజేయాలి

పెద్దబజార్, మే 17: ఎస్సీ, ఎస్టీ రైతులకు చిన్న సన్నకారు రైతులకు ఉచితంగా, ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీ అందజేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్టె జిలుగు తదితర విత్తనాలు అందజేయాలని అన్నారు. ఎరువులపై పెరిగిన రేట్లను ప్రభుత్వమే భరించాలని గతంలో విత్తనాలపై సబ్సిడీని ప్రభుత్వం ఎత్తివేసినందున ఆ సబ్సిడిని సైతం ప్రభుత్వం భరించాలని అన్నారు. పంటలకు బీమా పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని అకాల వర్షాలకు, వడగండ్ల వానలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. ఇప్పటికే రైతులు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు అందించడంలో జాప్యం జరుగకుండా వారి ఖాతాల్లో డబ్బులు వేయాలని దీంతో పాటు అన్ని రకాల వడ్లకు ఇతర పంటలకు 500 రూపాయలు బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటు ముఖ్యంగా అన్ని రకాల పంటలకు సీజన్‌కు ముందు మద్దతు ధరలు డాక్టర్ స్వామినాథన్ సూచించిన విధంగా పంటలు పెట్టుబడిలో 50 శాతం కలిపి సీ-2 ప్లెస్ 50 శాతం ధరలు ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, చిన్నయ్య, దేవస్వామి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

## ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలి

నిజామాబాద్ అర్బన్, మే 17: జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, విద్యార్థులు అనేక మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని జెఎన్‌టియు నుంచి కళాశాల ఏర్పాటుకు అనుమతి లభించిన అది కార్యరూపం దాల్చలేదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆ దిశగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో ఆజాద్, వేణుగోపాలచారి, మారుతి, ఆసీఫ్ ఉన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

- ఒకరికి 12రోజుల జైలు శిక్ష

ఖిల్లా, మే 17: మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందిని గుర్తించి వారిని కోర్టు ఎదుట హాజరు పర్చామని ట్రాఫిక్ ఏసీపీ బి.నారాయణ తెలిపారు. గురువారం నగరంలో వాహనాలను తనిఖీ చేయగా వారిలో 10మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించామన్నారు. వీరిని శుక్రవారం కోర్టు ఎదుట హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఎంఎం.అలీసిరాజ్ తొమ్మిది మందికి రూ.16000 జరిమానా విధించి మరో వ్యక్తికి 12రోజుల జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్ ఏసీసీ బి.నారాయణ తెలిపారు.

## వంజరి సంఘ నిబంధనలు మార్చాలి

నిజామాబాద్ అర్బన్, మే 17: రాష్ట్ర వంజరి సంఘంలో నియమ నిబంధనలలో మార్పులు చేర్పులు చేయాలని జిల్లా వంజరి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కరిపె సత్యం ఆధ్వర్యంలో పలువురు రాష్ట్ర సంఘం బైలా కమిటీకి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం ఎన్నికలు ప్రతి మూడు సంవత్సరాలకొకసారి నిర్వహించుట, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో ప్రతి జిల్లా నుంచి ప్రాథమిక సభ్యులు ఎన్నుకునే విధంగా మార్చాలన్నారు. జంట నగరాల నుంచి కాకుండా అధ్యక్షుడిని ఒక పర్యాయం అర్బన్ నుంచి కేటాయిస్తే ప్రధాన కార్యదర్శి రూరల్‌కు కేటాయించాలని, ట్రస్ట్ బోర్డులో ప్రతి జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్షుని బ్యాలెట్ పత్రం వేరుగా, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఇతర కార్యవర్గ సభ్యుల బ్యాలెట్ పత్రాలు విడివిడిగా ఉండేలా ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల యొక్క బ్యాలెట్ పత్రం ఆయా జిల్లాలకు విడివిడిగా ఉండాలని కోరారు. ఆయనతో పాటు వంజరి సంఘం జిల్లా నాయకులు సుభాష్, కరిపె రవీందర్, తదితరులు ఉన్నారు.

## పూర్తిస్థాయిలో సానిటరీ ఇన్స్‌పెక్టర్లను నియమించాలి

సుభాష్‌నగర్, మే 17: నిజామాబాద్ నగర పాలక సంస్థలో పూర్తిస్థాయి సానిటరీ ఇన్స్‌పెక్టర్లను నియమించాలని భారత రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ సానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. హెల్త్ అసిస్టెంట్‌కు డిప్యూటేషన్ ద్వారా సానిటరి ఇన్స్‌పెక్టర్‌గా నియమించడం జరిగిందని వారిని తిరిగి హెల్త్ అసిస్టెంట్‌గా నియమించి వారి స్థానంలో పూర్తిస్థాయిలో సానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను నియమించాలన్నారు. ఔట్‌సోర్సింగ్‌లో జవాన్‌లను తొలగించి పూర్తిస్థాయిలో జవాన్‌లను నియమించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న జవాన్‌లకు అవగాహన లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న డ్రైవర్స్‌కు సిబ్బందికి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ఆర్డర్ కాపీ లేకుండా ఔట్‌సోర్సింగ్ జవాన్‌లుగా పనిచేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'పెండింగ్ కేసుల పరిష్కారానికి దృష్టి పెట్టాలి'

ఖిల్లా, మే 17: ఆయా పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టి వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని నిజామాబాద్ ఏసిపి రాజవెంకటరెడ్డి ఆదేశించారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగేనవార్ ఆదేశాల మేరకు శుక్రవారం డివిజన్ స్థాయి అధికారులతో నెలవారి సమీక్ష నిర్వహించి వారికి పలు సూచనలు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రతి పోలీసు స్టేషన్ల పరిధుల్లో ఎటువంటి నేరాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయా పరిధిల్లోని ఇన్స్‌పెక్టర్లకు, ఎస్ఐలకు ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సేకరించి వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇటీవల పలు పోలీసు స్టేషన్లలో దొంగతనాలు పెరిగుతున్నాయని రాత్రివేళ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అనుమానితులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించి మెప్పు పొందాలని, పోలీసు శాఖకు గౌరవాన్ని తీసుకొని రావాలని తెలిపారు. విధుల్లో అలసత్వం పనికి రాదని తెలిపారు. పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదు దారులతో స్నేహభావంగా మెలిగి వారి సమస్యల పరిష్కారాని కృషి చేయాలన్నారు. ఆయా పోలీసు స్టేషనల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు.

## మహేష్‌గౌడ్‌కు ఘనస్వాగతం

నిజామాబాద్ అర్బన్, మే 17: కుటుంబ సమేతంగా దుబాయ్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుక్రవారం అక్కడ ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. జిల్లాకు చెందిన సత్యంగౌడ్ తదితరులు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు దుబాయ్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు.



## గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్, మే 17: గిరిజన జూనియర్ కళాశాలల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్ల కొరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని రీజినల్ కోఆర్డినేటర్ టి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న కామారెడ్డి పట్టణంలోని సరంపల్లి ఎక్స్‌రోడ్‌లోగల నాగిరెడ్డిపేట గిరిజన గురుకులంలో బాలురకు, మెదక్‌జిల్లా చేగుంటలో గల జూనియర్ కళాశాలలో 25న బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 2023-24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన ఎస్టీ బాల బాలికలకు ఈ కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని అన్నారు. మెమో, బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్‌నెట్ ధృవపత్రాలు తీసుకొని కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు కౌన్సిలింగ్ ఉంటుందని గిరిజన గురుకులాలలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఇతర కులాల వారికి పరిమితి సంఖ్యలో ఖాళీలు ఉన్నాయన్నారు.

## మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్ ఆత్మహత్యాయత్నం

పెద్దబజార్, మే 17: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో మెడికల్ కళాశాలలో ఆత్మహత్య ఘటనలను ఆందోళనకరంగా మారిన నేపథ్యంలో ఈసారి మరో జూనియర్ డాక్టర్ ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మహిళా జూనియర్ డాక్టర్ గత రెండు రోజుల కిందట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని విశ్వసనీయంగా తెలసింది. జూనియర్ డాక్టర్ కుటుంబ కలహాల వల్ల మనస్థాపంకు గురై రెండు రోజుల క్రితం నిద్రమాత్రలు మింగడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అదే రూములో ఉన్న జూనియర్ డాక్టర్లు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసి సదరు జూనియర్ డాక్టర్ కుటుంబ సభ్యులు వచ్చి పరామర్శించారు. కుటుంబ కలహాల వల్ల మనస్తాపం చెంది ఈ విధంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు.

## ఆసుపత్రి ఎదుట ఆందోళన

పెద్దబజార్, మే 17: ఠాగూర్ సినిమాను తలపిస్తున్న ప్రైవేటు ఆసుపత్రి. ఈ ఆసుపత్రిని నమ్మి వద్దు వచ్చి ప్రాణాలు పోగొట్టుకోవద్దు అంటూ మృతుడి తాలుక కుటుంబీకులు శుక్రవారం నగరంలోని ఎల్లమ్మగుట్టలోగల ప్రైవేటు ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని నిరసిస్తూ శుక్రవారం ఆసుపత్రి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నవీపేట మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెం దిన నారాయణకు గుండెపోటు రావడంతో వారం కిందట మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. అనంతరం సర్జరీ చేశారు. కాగా, గురువారం నారాయణ మృతి చెందాడు. కానీ ఈ విషయాన్ని ఆసుపత్రి సిబ్బంది దాచిపెట్టారని ఆరోగ్యశ్రీ కింద జరిగిన చికిత్సకు తమవద్ద నుంచి అదనంగా డబ్బులు కట్టించుకున్నారని కుటుంబీకులు ఆరోపించారు. ఆసుపత్రి నిర్లక్ష్యం పై ప్లకార్డులు ప్రదర్శించారు. తిరిగి సీపీ కార్యాలయానికి వెళ్లగా ఇంతలోనే పోలీసులు మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో తరలించారు. ఆగ్రహానికి గురైన కుటుంబీకులు, బంధువులు తిరిగి నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం ఈఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



## చికెన్ ధరలు

| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | రూ.140 | రూ.270 | రూ. 290 |
| వెన్‌కాబ్(కిలో) | రూ.145 | రూ.275 | రూ. 295 |

## బంగారం ధరలు

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.73,200 | రూ.67,500 | రూ.875 |

## సినిమా గైడ్ నిజామాబాద్

### పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1
: కృష్ణమ్మ (1.20, 7.25)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (4.15)
: అపరిచితుడు (10.20)

స్క్రీన్-2
: ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్ 3డి) (12.00, 2.25, 4.50, 7.15, 9.40)

స్క్రీన్-3
: కర్గమ్ భుగ్గం (హిందీ) (1.10)
: ఆ ఒక్కటి అడక్కు (4.05)
: శ్రీకాంత్ (హిందీ) (7.00, 10.00)

స్క్రీన్-4
: నటరత్నాలు (12.10)
: దర్శిని (2.50)
: మిరల్ (5.30, 10.30)
: అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (8.05)

### ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1
: అపరిచితుడు (1.30, 7.30)

స్క్రీన్-2
: ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్) (10.45, 4.30, 7.30)
: ఆ ఒక్కటి అడక్కు (1.40)
: మిరల్ (10.30)

స్క్రీన్-3
: అపరిచితుడు (10.35)
: మిరల్ (1.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.40, 10.30)
: బాక్ (7.30)

